నేటి మ్యాచ్‌లు | రాజస్థాన్ X బెంగళూరు మ.3.30 నుంచి | వేదిక జైపూర్ | ఢిల్లీ X ముంబై రా.7.30 నుంచి | వేదిక ఢిల్లీ | www.ntnews.com

అభిషేక్ 141

55 బంతుల్లో 14ఫోర్లు, 10 సిక్స్‌లు • ఉప్పల్‌లో సూపర్‌సెంచరీతో వీరవిహారం

పంజాబ్‌పై హైదరాబాద్ ఘన విజయం • ఐపీఎల్‌లో రెండో అత్యుత్తమ ఛేదన

సన్‌రైజర్స్ హైదరాబాద్(ఎస్ఆర్‌హెచ్) గెలుపు గర్జన! సొంత ఇలాఖాలో తమ సత్తాఏంటో ప్రత్యర్థి పంజాబ్ కింగ్స్‌కు రుచిచూపిస్తూ మళ్లీ గెలుపు బాట పట్టింది. వరుస ఓటములతో ప్లేఆఫ్స్ అవకాశాలు క్లిష్టమవుతున్న వేళ తప్పక గెలువాల్సిన పోరులో హైదరాబాద్..పంజాబ్‌పై పంజా విసిరింది. ఉప్పల్ స్టేడియంలో పరుగుల వరద పారిన మ్యాచ్‌లో యంగ్ అండ్ డైనమిక్ అభిషేక్‌శర్మ ఉప్పెనలా విరుచుకుపడ్డాడు. పంజాబ్ బౌలర్లను అనామకులను చేస్తూ 14ఫోర్లు, 10 భారీ సిక్స్‌లతో విధ్వంసం సృష్టించాడు. కొడితే ఫోర్ లేదంటే సిక్స్ అన్న రీతిలో చెలరేగుతూ అభిషేక్ కొట్టిన కొట్టుడుకు స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీకి పూనకాలు తెప్పించాడు. వార్‌వన్‌సైడ్ అన్నట్లు సాగిన పోరులో హైదరాబాద్ మరో 9 బంతులు మిగిలుండగానే భారీ విజయాన్ని నమోదు చేసుకుంది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జూలు విదిల్చింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన హైస్కోరింగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. పంజాబ్ నిర్దేశించిన 246 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 18.3 ఓవర్లలో 247/2 స్కోరు చేసింది. అభిషేక్‌శర్మ(55 బంతుల్లో 141, 14ఫోర్లు, 10 సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు. అభిషేక్‌కు తోడు హెడ్(66) జత కలువడంతో రైజర్స్ గెలుపు నల్లేరుపై నడక అయ్యింది. అర్ష్‌దీప్ సింగ్, చాహల్‌కు ఒక్కో వికెట్ దక్కింది. తొలుత శ్రేయాస్ అయ్యర్(36 బంతుల్లో 82, 6ఫోర్లు, 6సిక్స్‌లు) అర్ధసెంచరీతో పంజాబ్ 20 ఓవర్లలో 245/6 స్కోరు చేసింది. హర్షల్(4/42) నాలుగు వికెట్లు తీశాడు. అభిషేక్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఓవరాల్‌గా ఐపీఎల్ చరిత్రలో రెండో అత్యుత్తమ ఛేదనగా హైదరాబాద్, పంజాబ్ పోరు నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

పంజాబ్: 20 ఓవర్లలో 245/6(అయ్యర్ 82, ప్రభ్‌సిమ్రన్ 42, హర్షల్ పటేల్ 4/42, మలింగ 2/45), **హైదరాబాద్:** 18.3 ఓవర్లలో 247/2(అభిషేక్ 141, హెడ్ 66, అర్ష్‌దీప్‌సింగ్ 1/37, చాహల్ 1/56),

అభిషేక్ హోరు:

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ..ఉప్పల్‌లో అభిమానులకు పూనకాలు తెప్పించాడు. పంజాబ్ నిర్దేశించిన 246 పరుగుల భారీ లక్ష్యఛేదనలో హైదరాబాద్‌కు అభిషేక్ ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. హెడ్‌ను అండగా చేసుకుంటూ అభిషేక్..విధ్వంస రచనకు శ్రీకారం చుట్టాడు. నాలుగు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్టాయినిస్ ఇచ్చిన లైఫ్‌ను వినియోగించుకున్న శర్మ..యాన్సెన్‌ను హ్యాట్రిక్ ఫోర్లతో అరుసుకున్నాడు. పొదుపుగా బౌలింగ్ చేసే అర్ష్‌దీప్‌సింగ్‌ను లక్ష్యంగా చేసుకున్న హెడ్ మూడు ఫోర్లు కొట్టడంతో మూడో ఓవర్‌లో 12 పరుగులు వచ్చాయి. ఓవైపు అభిషేక్, మరోవైపు హెడ్ దంచుడుతో పంజాబ్ బౌలర్లు చేష్టలుడిగిపోయారు. వీరి జోరుకు అడ్డుకట్ట వేసేందుకు పంజాబ్ కెప్టెన్ అయ్యర్ ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. 20 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్న అభిషేక్..లక్ష్యాన్ని అంతకంతకూ కరిగించుకుంటూ పోయాడు. దూకుడు ప్రదర్శించిన అభిషేక్ మరో 20 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. 100 పరుగులకు చేరుకోగానే తన జేబులో నుంచి చిట్టి తీస్తూ సంబురాలు చేసుకున్నాడు. హెడ్ ఔటైనా ఎక్కడా జోరు తగ్గించని శర్మ..తన కెరీర్‌లో అత్యుత్తమ స్కోరు అందుకుని అర్ష్‌దీప్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఆఖర్లో క్లాసెన్(21 నాటౌట్), ఇషాన్‌కిషన్(9 నాటౌట్) మరో 9 బంతులు మిగిలుండగానే గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు.

అయ్యర్ అదుర్స్:

పంజాబ్‌కు అదిరిపోయే ఆరంభం లభించింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్‌సింగ్..షమీని లక్ష్యంగా చేసుకుంటూ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగాడు. అంతటితో ఆగకుండా మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన షమీని ఆర్య 6,6,4 దంచగా, ప్రభ్‌సిమ్రన్ మరో సిక్స్ కొట్టాడు. ఇలా ఇద్దరు వంతులు వేసుకుంటూ మరీ బౌండరీలు బాదడంతో మూడు ఓవర్లు ముగిసే సరికి పంజాబ్ 50 పరుగుల మార్క్ అందుకుంది. ఇన్నింగ్స్ దూసుకెళుతున్న తరుణంలో హర్షల్ బౌలింగ్‌లో ఆర్య(36) తొలి వికెట్‌గా ఔట్ కావడంతో 66 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్...ప్రభ్‌సిమ్రన్‌కు జతకలిశాడు. ఈ మ్యాచ్ ద్వారా ఐపీఎల్ అరంగేట్రం చేసిన ఇషాన్ మలింగ..7వ ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. మలింగ 9వ ఓవర్‌లో అయ్యర్ రెండు కండ్లు చెదిరే సిక్స్‌లతో ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాడు. నేహాల్‌ను అండగా చేసుకుంటూ జీషాన్ 12వ ఓవర్‌లో అయ్యర్ రెండు భారీ సిక్స్‌లకు తోడు ఫోర్‌తో చెలరేగడంతో 20 పరుగులు వచ్చి చేరాయి. ఈ క్రమంలో ఐపీఎల్‌లో 22 బంతుల్లోనే అయ్యర్ వేగవంతమైన అర్ధసెంచరీని నమోదు చేసుకున్నాడు.హర్షల్ ఈసారి..శశాంక్(2),అయ్యర్‌తో పాటు మ్యాక్స్‌వెల్(3)ను పెవిలియన్ పంపాడు. షమీ ఆఖరి ఓవర్‌లో స్టాయినిస్ నాలుగు సిక్స్‌లు కొట్టి స్కోరును 245 పరుగులకు తీసుకొచ్చాడు.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
ఢిల్లీ	4	4	0	8	1.27
గుజరాత్	6	4	2	8	1.08
లక్నో	6	4	2	8	0.16
కోల్‌కతా	6	3	3	6	0.80
బెంగళూరు	5	3	2	6	0.53
పంజాబ్	5	3	2	6	0.06
రాజస్థాన్	5	2	3	4	-0.73
హైదరాబాద్	6	2	4	4	-1.24
ముంబై	5	1	4	2	-0.01
చెన్నై	6	1	5	2	-1.55

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

లక్నో హ్యాట్రిక్

మార్క్‌రమ్, పూరన్ విజృంభణ • గుజరాత్‌పై ఘన విజయం

మార్క్‌రమ్(58)

లక్నో: ఐపీఎల్‌లో లక్నో సూపర్‌జెయింట్స్(ఎల్ఎస్‌జీ) అదరగొడుతున్నది. లీగ్ ఆదిలో తడబడ్డ లక్నో అద్భుతంగా పుంజుకుంది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో లక్నో 6 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్(38 బంతుల్లో 60, 6ఫోర్లు, సిక్స్), సాయి సుదర్శన్(37 బంతుల్లో 56, 7ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో గుజరాత్ 20 ఓవర్లలో 180/6 స్కోరు చేసింది. బట్లర్(12), షారుఖ్‌ఖాన్(11) నిరాశపరిచారు. శార్దుల్ ఠాకూర్(2/34), రవి బిష్ణోయ్(2/36) రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనకు దిగిన లక్నో 19.3 ఓవర్లలో 186/4 స్కోరు చేసింది. నికోలస్ పూరన్(34 బంతుల్లో 61, ఫోర్, 7సిక్స్‌లు), మార్క్‌రమ్(31 బంతుల్లో 58, 9ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో లక్నో విజయంలో కీలకమయ్యారు. ప్రసిద్ధ్ కృష్ణ(2/26)కు రెండు వికెట్లు దక్కాయి. సూపర్‌ఫీల్డింగ్‌తో పాటు సమయోచిత అర్ధసెంచరీతో జట్టును గెలిపించిన మార్క్‌రమ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

గిల్, సుదర్శన్ రాణించగా:

టాస్ గెలిచిన లక్నో..గుజరాత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఈ సీజన్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న సుదర్శన్..లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. మరో ఎండ్‌లో గిల్ కూడా దూకుడు కనబర్చడంతో గుజరాత్‌కు పరుగుల రాక సులువైంది. ఓవర్‌కు కచ్చితంగా ఒకటికి తగ్గకుండా బౌండరీ బాదడంతో పవర్‌ప్లే ముగిసే సరికి టైటాన్స్ వికెట్ కోల్పోకుండా 54 పరుగులు చేసింది. ఈ జోడీని విడదీసేందుకు లక్నో కెప్టెన్ పంత్ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో 31 బంతుల్లో గిల్ అర్ధసెంచరీ మార్క్ అందుకోగా, సుదర్శన్ చక్కని సహకారం అందించాడు. దిగ్వేశ్ ఇన్నింగ్స్ 11వ ఓవర్‌లో ఫోర్‌తో సుదర్శన్ ఈ సీజన్‌లో నాలుగో అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. వీరిద్దరి జోరు చూస్తుంటే భారీ స్కోరు ఖాయమనుకుంటున్న తరుణంలో అవేశ్‌ఖాన్ 13వ ఓవర్‌లో గిల్‌ను ఔట్ చేయడం ద్వారా 120 పరుగుల భారీ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. గిల్ తర్వాత టైటాన్స్ ఇన్నింగ్స్ అదే దూకుడు కొనసాగించలేకపోయింది. రెండు పరుగుల తేడాతో సుదర్శన్ కూడా ఔట్ కావడంతో 122 పరుగులకు ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఆకట్టుకున్న సుందర్(2) త్వరగానే పెవిలియన్ చేరగా, బట్లర్(16) బ్యాటు ఝుళిపించలేకపోయాడు. ఆఖర్లో రూథర్‌ఫర్డ్(22), షారుఖ్‌ఖాన్(11 నాటౌట్) బౌండరీలతో గుజరాత్ మెరుగైన స్కోరు అందుకుంది.

మార్క్‌రమ్, పూరన్ మెరుపులు:

లక్ష్యఛేదనను లక్నో ధాటిగా ఆరంభించింది. ఫామ్‌లేమితో సతమతమవుతున్న కెప్టెన్ పంత్..మార్క్‌రమ్‌తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించాడు. సిరాజ్ తొలి ఓవర్ ఆఖరి బంతికి ఫోర్‌తో మొదలుపెట్టిన మార్క్‌రమ్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. సిరాజ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మార్క్‌రమ్ రెండు ఫోర్లతో చెలరేగితే పంత్ మరో ఫోర్ అరుసుకున్నాడు. ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన ప్రసిద్ధ్ కృష్ణ వరుసగా రెండు బంతుల్లో ఔటయ్యే ప్రమాదం నుంచి మార్క్‌రమ్ బయటపడ్డాడు. మరోవైపు పంత్ తన ట్రేడ్‌మార్క్ షాట్లతో చెలరేగడంతో లక్నో 6 ఓవర్లు ముగిసే సరికి 61 పరుగులు చేసింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని పంత్‌ను ప్రసిద్ధ్ ఔట్ చేయడం ద్వారా విడదీశాడు. ఆ తర్వాత వచ్చిన పూరన్..మార్క్‌రమ్‌కు జత కలువడం ఇన్నింగ్స్ గతిని మార్చింది. ఈ సీజన్‌లో దుమ్మురేపుతున్న పూరన్..7 పరుగుల వద్ద రషీద్ క్యాచ్ విడిచిపెట్టడంతో బతికిపోయాడు. సాయికిషోర్ 10వ ఓవర్‌లో పూరన్ మూడు భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. అర్ధసెంచరీ తర్వాత మార్క్‌రమ్ ఔటైనా..పూరన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. 23 బంతుల్లోనే అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్నాడు. అయితే రషీద్ 16వ ఓవర్‌లో ధాటిగా ఆడే ప్రయత్నంలో పూరన్ క్యాచ్ ఔట్‌గా నిష్క్రమించాడు. బదోనీ(28 నాటౌట్), సమద్(2 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు.

పూరన్(61)

సంక్షిప్త స్కోర్లు:

గుజరాత్: 20 ఓవర్లలో 180/6(గిల్ 60, సుదర్శన్ 56, శార్దుల్ 2/34, బిష్ణోయ్ 2/36), **లక్నో:** 19.3 ఓవర్లలో 186/4(పూరన్ 61, మార్క్‌రమ్ 58, ప్రసిద్ధ్ 2/26, సుందర్ 1/28)

పంకజ్ అద్వానీకి రజతం

న్యూఢిల్లీ: డబ్ల్యూబీఎల్ వరల్డ్ మ్యాచ్‌ప్లే బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ రజత పతకంతో మెరిశాడు. శనివారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో అద్వానీ 7-8 తేడాతో డేవిడ్ కాజియర్ చేతిలో ఓటమిపాలయ్యాడు. 15 రౌండ్ల పాటు సాగిన తుది పోరులో అద్వానీ తొలుత 2-0తో ఆధిక్యంలో ఉన్నా..ఆ తర్వాత ప్రత్యర్థి పుంజుకోవడంతో మ్యాచ్ చేజారింది. ఆదివారం నుంచి మొదలుకానున్న ఐబీఎస్ఎఫ్ వరల్డ్ బిలియర్డ్స్ టోర్నీలో అద్వానీ బరిలోకి దిగనున్నాడు.

గాయంతో ఫిలిప్స్ ఔట్

అహ్మదాబాద్: గుజరాత్ టైటాన్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్ గాయం కారణంగా ఐపీఎల్‌కు పూర్తిగా దూరమయ్యాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయపడ్డ ఫిలిప్స్ మెరుగైన చికిత్స కోసం స్వదేశం న్యూజిలాండ్‌కు బయల్దేరి వెళ్లినట్లు టైటాన్స్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో గాయపడ్డ ఫిలిప్స్ వెంటనే మైదానాన్ని వీడాడు. ఈ సీజన్‌లో తుదిజట్టుకు ఆడలేకపోయిన ఈ స్టార్ క్రికెటర్‌ను గాయం దెబ్బతీసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.